క్లుప్తంగా

వైభవంగా విగ్రహ ప్రతిష్ట



ఆలయంలో ప్రతిష్ఠించిన విగ్రహాలు

నగరి: మున్సిపల్ పరిధిలోని కీళపట్టు చంద్ర మౌళీశ్వర ఆలయంలో నూతన విగ్రహాల ప్రతిష్ట కార్యక్రమం ఆదివారం వైభవంగా జరిగింది. శ్రీదేవి, ప్రత్యంగర శరభేశ్వరర్, వరాహి, ఇతర పరివార దేవతల విగ్రహాలకు తొలుత సుమంగళులచే కలిపిన పసుపు నీటిలో జలావాసం చేయించారు. ప్రత్యేక పూజలనంతరం విగ్రహాలను బయటకు తీసి వేదపండితుల మంత్రోచ్ఛరణల నడుమ ఆలయం చుట్టూ ప్రతిష్ఠించారు. ఈ సందర్భంగా ఆలయంలో పూజలు హోరెత్తాయి. శివగామి సమేత చంద్రమౌళీశ్వర స్వామికి ప్రత్యేక పూజలు చేసి అలంకరించారు. భక్తులు అధిక సంఖ్యలో పూజలో పాల్గొన్నారు. ఆలయ నిర్వాహకులు సుబ్రమణ్యం విచ్చేసిన భక్తులకు ప్రసాదాలు పంపిణీ చేశారు.

భక్తి శ్రద్ధలతో సామూహిక గాయత్రి జపం



గాయత్రి జపం చేపడుతున్న జపతులు

తిరుపతి కల్చరల్: నరసింహ తీర్థం రోడ్డులో ఉన్న శివాలయంలో ఆదివారం లోకకల్యాణార్థం సామూహిక గాయత్రి జప పారాయణాన్ని అత్యంత భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. బ్రహ్మశ్రీ కల్వకొలను చిత్తరంజన్ దాస్ మెమోరియల్ ట్రస్ట్ తిరుపతి శాఖ ఆధ్వర్యంలో తిరుపతి కోఆర్డినేటర్ ఖండవల్లి రాధాకృష్ణ పర్యవేక్షణలో సుమారు 20 మంది జపతులు సామూహిక సంధ్యావందన సహిత గాయత్రి జపం చేశారు. అదేవిధంగా కల్వకొలను శ్రీరామచంద్రమూర్తి 60వ జన్మదినం సందర్భంగా కపిలతీర్థం సమీపంలోనున్న వృద్ధాశ్రమంలో అన్నదానం కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో తిరుపతి జోన్ పరిధిలోని జపతులంతా పాల్గొన్నారు.

రచయిత సురేంద్రకు సత్కారం



అన్నమయ్య పురస్కారంతో రచయిత రొద్ద సురేంద్రను సత్కరిస్తున్న నిర్వాహకులు

తిరుపతి కల్చరల్: తిరుపతికి చెందిన ప్రముఖ రచయిత రొద్ద సురేంద్రకు అన్నమయ్య పురస్కారం లభించింది. రచనా, విద్యా, కళారంగాల్లో విశేష కృషి చేసిన వారికి బైరెడ్డిపల్లె సంప్రదాయ కళల పరిరక్షణ సమితి, తిరుపతి ఏఎస్ ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం ప్రతిభా పురస్కారాలు ప్రదానం చేశారు. ఇందులో రచనా రంగంలో విశేష సేవలు అందించి కళామతల్లికి సేవలందిస్తున్న రచయిత రొద్ద సురేంద్రను అన్నమయ్య పురస్కారంతో ఘనంగా సత్కరించి అభినందించారు.

అన్నదానానికి రూ.5లక్షల విరాళం

చౌడేపల్లె: పుణ్యక్షేత్రమైన శ్రీ బోయకొండ గంగమ్మ ఆలయంలో ఉచిత అన్నదానం నిర్వహణకు తిరుపతికి చెందిన బాలాజి దంపతులు రూ.5 లక్షల విరాళమిచ్చారు. ఆదివారం చెక్‌ను ఆలయ కమిటీ చైర్మన్ నాగరాజారెడ్డి, ఈఓ చంద్రమౌళికి అందజేశారు. తొలుత అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి మొక్కులు చెల్లించారు. అనంతరం ఆలయ అధికారులు అమ్మవారి చిత్రపటాన్ని అందజేసి శాలువతో సత్కరించారు. వేదపండితులు ఆశీర్వవచనం పలికారు. కార్యక్రమంలో బోయకొండ ఆలయ కమిటీ డైరెక్టర్ రాజేష్ పాల్గొన్నారు.

వృత్తే దైవం

కొయ్య(దారు)కి జీవం పోస్తూ తమ శిల్పకళా చాతుర్యంతో జీవనోపాధి పొందుతున్నారు తొరూరు గ్రామస్తులు. గ్రామంలోని పలు కుటుంబాలకు చెందిన కళాకారులు చిన్న ఉలి, చెక్కసుత్తితో గణపతి, శ్రీవేంకటేశ్వరస్వామి, దశావతారాలు, అష్టలక్ష్ములు, సకల దేవతా మూర్తులు, గృహోపకరణాల కళాకృతులు ఒకదానికి మరొకటి జీవం పోసుకోవడం అందరినీ అబ్బురపరుస్తోంది. ఆరు దశాబ్దాల చరిత్ర కలిగిన ఈ కళా వస్తువులకు గల్లీ నుంచి ఢిల్లీ వరకు మంచి గిరాకీ ఉంది. ప్రభుత్వాలు సైతం తొరూరు కళాకారుల ప్రతిభను గుర్తించి మరింతగా ప్రోత్సహించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

- కళలకు ప్రతిరూపాలు తొరూరు కళాకారులు
- బొమ్మల తయారీయే వారికి జీవనాధారం
- కొయ్యితో అద్భుత కళాఖండాలు తీర్చిదిద్దుతున్న కళాకారులు
- రాష్ట్రస్థాయిలో తొరూరుకు గుర్తింపు



శ్రీవేంకటేశ్వరస్వామి బొమ్మ

పుత్తూరు: చెక్క శిల్పాల గనిగా తొరూరు గ్రామం రాష్ట్రస్థాయి గుర్తింపు పొందింది. పుత్తూరు పట్టణానికి నాలుగు కిలోమీటర్ల దూరంలో తొరూరు గ్రామం ఉంది. గ్రామంలోని వారంతా వ్యవసాయం, కూలి పనుల మీదే ఆధారపడి జీవిస్తున్నారు. అయితే సుమారు 40 కుటుంబాల వారు మాత్రం బొమ్మల తయారీపైనే ఆధారపడి జీవిస్తుండడం విశేషం. ఆరు దశాబ్దాల కిందట ఇదే గ్రామానికి చెందిన ఎం.రామలింగం అనే వ్యక్తి కొయ్య బొమ్మలు చెక్కడంపై చూపించిన చొరవ తొరూరు గ్రామానికే కీర్తిని తెచ్చిపెట్టింది. తనతో పాటు మరి కొందరికి బొమ్మలు చెక్కడంపై తర్ఫీదు ఇచ్చాడు. దీంతో పలు కుటుంబాలకు బొమ్మల తయారీ జీవనాధారమైంది. తొలుత చిన్న చిన్న బొమ్మలను మాత్రమే తయారు చేసే వారు. వీటిని అమ్ముకోవడం పెద్ద సమస్యగా ఉండేది. దీంతో రామలింగం మద్రాసుకు వెళ్లి వాటిని అమ్ముకుని వచ్చేవాడు. క్రమేపీ వాటిని హైదరాబాద్, బెంగళూరు, విజయవాడ వంటి పట్టణాలకు తీసుకెళ్లి అమ్ముకొచ్చేవారు. క్రమేపీ కళాకృతులను హైదరాబాద్, బెంగళూరు, విజయవాడ, ఢిల్లీ, ముంబై వంటి పట్టణాలకు తీసుకెళ్లి అమ్మకాలు చేస్తుండడంతో వ్యాపారాలు ఆశాజనకంగా ఉన్నట్లు కళాకారులు చెబుతున్నారు.



హంసలు



తొరూరు కళాకారులు తయారు చేసిన గణపతి బొమ్మ



తోరణాలు

ఒకదానికి మించి మరొకటి..

అమ్మకాలు ఆశాజనకంగా ఉండడంతో ప్రస్తుతం ఆరడుగుల నిలువెత్తు శ్రీవేంకటేశ్వరస్వామి, శ్రీకృష్ణ సత్యభామ, గణపతి వంటి బొమ్మలతో పాటు గృహోపకరణాలకు సంబంధించి ఏనుగు తల, గుర్రం, దశావతారాలు, తోరణాలు వంటి పలు బొమ్మలు తయారు చేస్తున్నారు. ప్రస్తుతం వీటిని నెల నెలా నగరాల్లో నిర్వహించే ఎగ్జిబిషన్లలో పెట్టి అమ్మకాలు జరుపుతున్నారు. వీరికి చేయూతనిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఎగ్జిబిషన్స్‌లో పెట్టే స్టాల్స్‌ను ఉచితంగా ఇవ్వడంతో పాటు ఉచిత వసతి సౌకర్యం కల్పిస్తోంది.



దశావతారాల బొమ్మ

చేయూతనిస్తే అద్భుతాలు సృష్టిస్తాం..



గత ఏడేళ్లుగా బొమ్మల తయారీ పనిచేస్తున్నా. గ్రామంలో సుమారు 40 కుటుంబాలు ఈ బొమ్మల తయారీపైనే ఆధారపడి జీవిస్తున్నాయి. అందరం బొమ్మల తయారీపైనే ఆధారపడి జీవిస్తున్నాం. బొమ్మ తయారీలో నైపుణ్యం, శ్రద్ధతో పాటు సహనం అవసరం. చిన్న పొరబాటు జరిగినా చెక్క మొత్తం పడేయాల్సిందే. మా కూలి ప్రస్తుత ధరలకు సరిపోవడం లేదు. ప్రభుత్వం మాలాంటి కళాకారులకు పెన్షన్ అందించి ఆదుకోవాలి. ప్రభుత్వ ప్రోత్సాహం ఉంటే అద్భుత కళాకండాలు సృష్టిస్తాం. యువత సైతం చేతి వృత్తుల పట్ల ఆసక్తి చూపుతుంది.

–ముని, దారుశిల్పి కళాకారుడు, తొరూరు, పుత్తూరు మండలం

ప్రభుత్వ ప్రోత్సాహం అవసరం..



మా మామ రామలింగం అందించిన బొమ్మల తయారీని వృత్తిగా కొనసాగించిన నాభర్త పార్థసారధి అనారోగ్యంతో మృతి చెందారు. దీంతో కుటుంబంతో పాటు మాపై ఆధారపడిన పలు కుటుంబాల జీవనోపాధి అందించాలన్న ఉద్దేశంతో ఇదే వృతిని కొనసాగిస్తున్నా. ప్రస్తుతం 20 మందికి పని కల్పిస్తున్నా. ప్రభుత్వం తక్కువ వడ్డీతో ఆర్థిక సాయం చేస్తే మేలైన కళాకండాలను అందిస్తాం. ప్రస్తుతం కొయ్యల ధరలు ఎక్కువగా ఉన్నాయి. ఢిల్లీ, ముంబై, బెంగళూరు, చెన్నై వంటి నగరాల్లో ఎగ్జిబిషన్స్‌లో అమ్మకాలు జరపాలంటే పెద్ద మొత్తంలో పెట్టుబడులు అవసరం. ఇందుకు ప్రభుత్వ ప్రోత్సాహం అవసరం.

–ఎం.చంద్రకళ, దారుశిల్పి, తొరూరు, పుత్తూరు మండలం

సుమధురం.. సంకీర్తనల గానం



సంకీర్తనలు గానం చేస్తున్న అన్నమయ్య వంశానికి చెందిన లలిత, హయగ్రీవ నారాయణచార్యులు



గానం చేస్తున్న సంగీతకారులు శ్రీనివాస శర్మ బృందం

తిరుపతి కల్చరల్: ప్రముఖ సంగీత విద్యాంసులు హైదరాబాద్‌కు చెందిన శ్రీనివాస శర్మ బృందం, లలిత, హయగ్రీవ నారాయణచార్యుల బృందం ఆలపించిన అన్నమయ్య సంకీర్తనల గానామృతం సుమధురంగా సాగింది. అన్నమయ్య 616వ జయంతి ఉత్సవాల్లో భాగంగా ఆదివారం సాయంత్రం భక్తి సంకీర్తనల గాత్ర కచేరీ నిర్వహించారు. అన్నమాచార్యుల వంశానికి చెందిన 13వ తరం వారసులు ప్రముఖ సంగీత విద్యాంసులు డాక్టర్ లలిత, హయగ్రీవ ఆలపించిన కీర్తనలతో భక్తజనం తన్మయత్వం చెందారు. ఇందులో భాగంగా వారు ఇందరికీ అభయంబు.., శోభనమే శోభనమే.., పిలువరే కృష్ణుని.., వేదం బెవ్వని వేడుకుందామా.. వంటి కీర్తనలను రమణీయంగా గానం చేసి సభికులను మైమరిపించారు. అనంతరం ప్రముఖ యువ సంగీతకారులు శ్రీనివాస శర్మ బందం పలు విచారమేల.., మత్స్య కూర్మ వరాహ.., రాజీవ నేత్రాయ.., ఎంత మాత్రమమున.., తానే స్వయంగా స్వరపరిచన ఆలపించిన కొనుట వెగ్గణము వంటి అన్నమయ్య సంకీర్తనలు గానం చేసి సంగీత ప్రియులను మంత్రముగ్ధులను చేశారు. ఈ సందర్భంగా కళాకారులను అన్నమాచార్యా ప్రాజెక్టు డైరెక్టర్ డాక్టర్ ఆకెళ్ల విభీషణ శర్మ, ప్రోగ్రాం అసిస్టెంట్ కోకిల ఘనంగా స్వామి ప్రసాదాలు అందజేసి సత్కరించి అభినందించారు.

నారాయణతే నమో.. నమో



కూచిపూడి నాట్యంతో అలరిస్తున్న కళాకారులు

చంద్రగిరి(తిరుచానూరు): వారాంతపు సాంస్కృతిక కార్యక్రమంలో భాగంగా తిరుచానూరు సమీపంలోని శిల్పారామంలో ఆదివారం సాయంత్రం నిర్వహించిన కూచిపూడి నాట్యం ప్రేక్షకులను అలరించింది. హైదరాబాద్‌కు చెందిన గాయత్రి స్కూల్ ఆఫ్ కూచిపూడి డ్యాన్స్, నాట్య గురువు జ్యోతి శేఖర్ ఆధ్వర్యంలో కళాకారులు నిర్వహించిన కూచిపూడి నాట్యం విశేషంగా ఆకట్టుకుంది. ఇందులో భాగంగా గణేష పంచరత్న, నారాయణతే, వినరో భాగ్యం, చక్కని తల్లికి, దశావతో శబ్దం, మండూక శబ్దం, జయ జయ దుర్గే, కృష్ణ రాసలీల వంటి పాటలకు కళాకారులు వైష్ణవి, లాస్య, మీనాక్షి, అక్షర, సహస్ర, ఈష, సాక్షర శ్రీ, సాయి శ్రీప్రియ ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. పాటకు తగిన అభినయం, హావభావాలతో కళాకారులు చూడచక్కని నృత్యాలను ప్రదర్శించడం ద్వారా ప్రేక్షకులు కరతాళ ధ్వనులతో వారిని అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా కళాకారులను ఏఓ ఖాదర్‌వల్లీ సత్కరించి, జ్ఞాపకలను అందజేశారు. కార్యక్రమంలో రాధాకృష్ణ, పప్పి, వరప్రసాద్, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

ఈత సరదా



బావిలో ఈత కొడుతున్న యువకులు



బావిలోకి దూకుతున్న యువకుడు

పాలసముద్రం: మండలంలో వేసవిలో రోజు రోజుకి ఎండలు ఎక్కువ కావడంతో యువకులు, పిల్లలు సేద్యపు బావుల్లో ఉల్లాసంగా ఈత కొడుతున్నారు. శని, ఆదివారం సెలవులు ఇవ్వడంతో యువకులు బావుల్లో ఈతలు కొడుతూ ఉల్లాసంగా ఉంటున్నారు. ఉదయం 10 నుండి మధ్యాహ్నం 2 గంటల వరకు విపరీతంగా ఎండల తీవ్రత తట్టుకునేందుకు ఈత కొడుతున్నారు. ఈత తెలియని పిల్లలు ప్లాస్టిక్ క్యాన్ నడుముకు కట్టుకుని ఈత నేర్చుకుంటున్నారు.

ఘనంగా వీరబ్రహ్మేంద్ర స్వామి గ్రామోత్సవం



విశేషాలంకారంలో వీరబ్రహ్మేంద్రస్వామి

బంగారుపాళెం: మండలంలోని బొమ్మాయిపల్లెలో శనివారం రాత్రి శ్రీ మద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి గ్రామోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. స్వామివారి ఆలయంలో వార్షికోత్సవ పూజలను మూడు రోజుల పాటు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో చివరి రోజు స్వామి మూల విగ్రహానికి ప్రత్యేక పూజలు అభిషేకాలు నిర్వహించారు. అనంతరం కల్యాణమహోత్సం చేశారు. పెద్ద సంఖ్యలో భక్తులు స్వామి వారి వార్షికోత్సవంలో పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం చేశారు. రాత్రి స్వామి వారి ఉత్సవ మూర్తులను ప్రత్యేకంగా అలంకరించి ట్రాక్టర్‌పై కొలువుదీర్చారు. మేళతాళాలు, మంగళ వాయిద్యాల నడుమ పురవీధుల్లో ఊరేగించారు. భక్తులు కొబ్బరికాయలు కొట్టి కర్పూర నీరాజనాలు సమర్పించారు.



బొమ్మాయిపల్లెలో స్వామివారి గ్రామోత్సవం

కనుల పండువగా ద్రౌపదీ దేవి కల్యాణం



ద్రౌపదీ సమేత ధర్మరాజ స్వామివారి కల్యాణోత్సవం నిర్వహిస్తున్న వేదపండితులు

పాలసముద్రం: మండలంలోని గంగమాంబపురం గ్రామంలో వెలసిన ధర్మరాజుస్వామి ఆలయంలో మహాభారత ఉత్సవాలలో భాగంగా ఆదివారం ద్రౌపది సమేత ధర్మరాజస్వామికి కల్యాణోత్సవం అంగరంగ వైభవంగా జరిగింది. అమ్మవారి కల్యాణోత్సవవారిని మంగళవాయిద్యాలతో గ్రామస్తులు అమ్మవారికి కొత్త దుస్తులు, పట్టువస్త్రాలు, పూజ సామగ్రితో అమ్మవారి ఆలయానికి చేర్చారు. ఆలయ అర్చకులు వేద మంత్రోచ్చారణ నడుమ శాస్త్రోక్తంగా జరిగిన ఈ కల్యాణోత్సవంలో వైభవంగా జరిపారు. భక్తులు తమిళనాడు, కర్ణాటక, మండల పరిధిలోని భక్తులు పెద్ద సంఖ్యతో పాల్గొన్నారు. మధ్యాహ్నం పూర్ణ భాగవతారిణి హరికథా గానం భక్తులను అలరించింది.

రమణీయం.. కళా సాంస్కృతికం



కళాకారులు, గాయకులను సత్కరించిన నిర్వాహకులు

తిరుపతి కల్చరల్: స్నేహ హోమ్ ఫర్ ఎల్డర్ ప్రారంభోత్సవం సందర్భంగా జీవకోనలోని రైస్ స్వచ్ఛంద సేవాసంస్థ కార్యాలయంలో ఆదివారం మన సంస్కృతి కళా సంస్థ కళాకారులు ప్రదర్శించిన సాంస్కృతిక అలరింపజేసింది. సుమారు 15 మంది గాయనీ గాయకులు అద్భుతమైన జానపద గీతాలతో ఆకట్టుకున్నారు. ఈ సందర్భంగా తమ పాట ఆటలతో అలరింపజేసిన గాయనీ గాయకులను, కళాకారులను ఘనంగా సత్కరించి అభినందించారు. కార్యక్రమంలో విశ్రాంత జడ్జి ఆనందరావు, రైస్ స్వచ్ఛంద సేవాసంస్థ అధ్యక్షుడు రామకృష్ణ, స్త్రీశక్తి సంఘటన సంస్థ కార్యదర్శి సుశీల, మన సంస్కృతి కళా సంస్థ ప్రధాన కార్యదర్శి కె.రెడ్డెప్ప, కళాకారులు, ఉపాధ్యాయులు గురుస్వామి, నీరజ, నాగమణి, కృష్ణకుమారి, లక్ష్మి, వెంకటరమణ, దప్పు చలపతి, ఆదివాసీ విద్యాలయ బాలికల వసతి గృహం డైరెక్టర్ సాకం కృష్ణమూర్తి పాల్గొన్నారు.

మెరుగ్గా ఆరోగ్యశ్రీ అమలు

- సిమ్స్, రుయా ఆస్పత్రుల తనిఖీ
- ఆరోగ్యశ్రీ ట్రస్టు సీఈఓ డాక్టర్ లక్ష్మీశ



రోగితో మాట్లాడుతున్న డాక్టర్ లక్ష్మీశ

తిరుపతి తుడా : ఆరోగ్యశ్రీ వైద్య సేవలను మరింత మెరుగ్గా అమలు చేస్తున్నామని ఆరోగ్యశ్రీ ట్రస్టు సీఈఓ డాక్టర్ జి.లక్ష్మీశ అన్నారు. ఆదివారం ఆయన తిరుపతి స్విమ్స్ ఆస్పత్రిలో ఎమర్జెన్సీ వార్డు, ఎమర్జెన్సీ ఐసీయూ వార్డుల్లో చికిత్స పొందుతున్న ఆరోగ్యశ్రీ రోగులను పరామర్శించారు. ఆరోగ్యశ్రీ సేవలు ఎలా అందుతున్నాయని రోగులను అడిగి తెలుసుకున్నారు. అలాగే రేడియేషన్ థెరపీ, ఆపరేషన్ థియేటర్‌ను సందర్శించి పని తీరు తెలుసుకున్నారు. జిల్లా సమన్వయ అధికారి డాక్టర్ రాజశేఖర్ రెడ్డి, జిల్లా మేనేజర్ శివకుమార్‌తో ఆయన కలిసి స్విమ్స్‌తో పాటు రుయాలోని పలు వార్డులను తనిఖీ చేశారు. అలాగే ఆరోగ్యశ్రీ టీం లీడర్స్ పురం శ్రీనివాసులు, సమాధి శ్రీనివాసులు, ఆరోగ్య మిత్రా పాల్గొన్నారు. స్విమ్స్ డైరెక్టర్ డాక్టర్ ఆర్.వి కుమార్, మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ ఆర్.రామ్, డాక్టర్ జయచంద్ర రెడ్డి, రుయా ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రవి ప్రభు, డీఎంహెచ్ఓ డాక్టర్ శ్రీహరి, డిప్యూటీ కలెక్టర్ భాస్కర నాయుడు, తదితరులు పాల్గొన్నారు.